సాక్షి ప్రకాశం

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



ట్రెండ్ సెట్టర్స్

టైలర్ల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. చేదోడు పథకంతో వారిని ఆర్థికంగా ఆదుకుంటోంది. నేడు టైలర్ల దినోత్సవం సందర్భంగా కథనం. - 8లో..

సర్వేయర్ ఆత్మహత్య



సీఎస్‌పురం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన బాలిక అదృశ్యం కేసులో అనుమానితుడిగా ఉన్న సర్వేయర్ సోమవారం ఒంగోలులో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సీఎస్‌పురం పోలీసులు, రైల్వే పోలీసులు విచారణ చేపట్టగా పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు ఎన్‌జీవో హోం భవనం ప్రారంభోత్సవం

ఒంగోలు అర్బన్: ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఏపీ ఎన్‌జీవో హోం, కళ్యాణ మండపం నూతన భవనం ప్రారంభిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కే శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఏపీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, స్టేట్ జనరల్ సెక్రటరీ కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, ప్రత్యేక ఆహ్వానితులుగా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు.

ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

ఒంగోలు: ఉచితవిద్యా హక్కు చట్టం కింద 2024–25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్ల కోటా కింద ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే తేదీల గడువును మార్చి 25వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. అనాథలు, హెచ్‌ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఓసీ పేదలకు ఇది వర్తిస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత గ్రామ సచివాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, సంబంధిత పాఠశాల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థుల ఎంపిక లాటరీ ద్వారా నిర్ణయిస్తారన్నారు. ఎవరికైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్–18004258599, 14477ను సంప్రదించవచ్చన్నారు.

జాబ్ ఫెస్ట్‌కు విశేష స్పందన



ఉద్యోగాలకు ఎంపికైన ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులు

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మంగళవారం నిర్వహించిన జాబ్ ఫెస్ట్‌కు విశేష స్పందన లభించింది. జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా ఈ ఫెస్ట్ నిర్వహించాయి. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ ఉద్యోగ నైపుణ్యాలు ఏ విధంగా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు సూచించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ , ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజ మాట్లాడుతూ ఉద్యోగాలు ఎంత సులువుగా చేసుకోవచ్చని, అయితే తెలివితేటలు ఉపయోగించుకుని మంచి ఉద్యోగ ఉన్నత స్థాయికి పోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహన్, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏవీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. మొత్తం 612 మంది విద్యార్థినులు పాల్గొనగా వారిలో 243 మంది వివిధ సంస్థల్లో అర్హత పొందినట్లు కంపెనీల హెచ్‌ఆర్‌లు ప్రకటించారు.

సిబ్బంది సమస్యల పరిష్కారంపై దృష్టి

- డీఎంహెచ్‌ఓ ఎస్ రాజ్యలక్ష్మి



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌ఓ, ఏఓ

ఒంగోలు టౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి తెలిపారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి పలువురు సిబ్బంది తరలివచ్చారు. జీత భత్యాలకు సంబంధించిన సమస్యలను డీఎంహెచ్‌ఓకు రాతపూర్వకంగా తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ ఆదేశాల మేరకు జిల్లా కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించినట్లు తెలిపారు. గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పరిపాలనాధికారి శ్రీవాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సాయం మిన్నగా...

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రైతుకు జీవితంపై భరోసా ఏర్పడింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దగా పడిన అన్నదాతలకు అండగా నిలిచారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. రైతును రాజుగా చూడాలన్న లక్ష్యంతో ఎన్నికల్లో హామీ ఇచ్చిన దానికంటే మిన్నగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి అడుగూ రైతన్న బాగు కోరుతూ క్రమం తప్పకుండా పెట్టుబడి సాయంతో పాటు అర్హులైన వారికి సున్నావడ్డీ రాయితీ సొమ్మును ఇస్తూ వస్తున్నారు. తాజాగా బుధవారం రైతు భరోసా, సున్నావడ్డీ రాయితీ కింద రూ.70.69 కోట్లు సాయం అందజేయనున్నారు.

- నేడు వైఎస్సార్ రైతుభరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ విడుదల
- ఐదో ఏటా రైతుల ఖాతాలో నగదు జమచేయనున్న జగన్ సర్కార్
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు
- పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా రూ.59.67 కోట్లు
- సున్నా వడ్డీ రాయితీ రూ.11.02 కోట్లు

ఒంగోలు సెంట్రల్: ఇచ్చిన మాటలకు కట్టుబడి రైతన్నలకు అండగా నిలుస్తున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. పంట సాగుకు అన్నదాతలు ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాన్ని ఏటా అమలు చేస్తూ వస్తున్నారు. క్రమం తప్పకుండా ఐదో ఏడాది నిధులు అందించేందుకు రంగం సిద్ధం చేశారు. బుధవారం సీఎం తాడేపల్లి కార్యాలయం నుంచి రూ. 2 వేలు రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు. అలాగే జిల్లాలో 2021–22 రబీలో, 2022 ఖరీఫ్‌లో రుణాలు తీసుకున్న రైతులకు సున్నా వడ్డీ రాయితీ కింద రూ.11.02 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

అర్హుడైన ప్రతి రైతు ఖాతాల్లో జమ..

ఎన్నికల హామీల్లో భాగంగా వైఎస్సార్ రైతు భరోసా రూ.12,500 అందజేస్తామని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పారు. అయితే అధికారంలోని వచ్చాక మరో వెయ్యి పెంచి ఏటా రూ.13,500 అందజేస్తున్నారు. ఈ క్రమంలో జూన్‌లో ఖరీఫ్ సీజన్‌కు ఒక్కో రైతుకు రూ.7,500, అక్టోబర్‌లో రబీకి రూ.4 వేలు జమ చేశారు. మిగిలిన రూ.2 వేలు బుధవారం ఇవ్వనున్నారు. జిల్లాలో రైతులు, కౌలు రైతులు, ఆర్ఓ ఎఫ్ఆర్ భూములు చేసుకునే రైతులు 2,95,585 మందికి రూ.59,67,01,500 పీఎం కిసాన్ వైఎస్సార్ రైతు భరోసా అందనుంది.



తాళ్లూరులో వరి కోస్తున్న రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి

అలాగే వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల మొత్తం విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ జేడీఏ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో 2021–22 రబీలో, 2022 ఖరీఫ్‌లో రుణాలు తీసుకున్న రైతులకు ఈ మొత్తం అందించనున్నట్లు చెప్పారు. రెండు సీజన్‌లలో పంట రుణాలు తీసుకున్న 39,260 మంది రైతులకు రూ.11.02 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. పంట సాగు నిమిత్తం రూ.లక్ష లోపు రుణాలు తీసుకుని సంవత్సరం లోపు వడ్డీ తిరిగి బ్యాంకుకు చెల్లించిన రైతులకు వడ్డీ నగదును ప్రభుత్వం చెల్లించనుంది.

2021-22 వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు లబ్ధిదారులు సంఖ్య డివిజన్‌ల వర్గాల వారి ఇలా ఉన్నాయి..

సబ్ డివిజన్	లబ్ధిదారుల సంఖ్య	సున్నా వడ్డీ మొత్తం
దర్శి	3270	89,70,907
గిద్దలూరు	4251	1,18,31,060
కనిగిరి	3182	63,47,126
మార్కాపురం	5073	1,57,56,373
ఒంగోలు	5296	1,23,37,171
ఎస్‌కొండ	2873	71,16,115
వైపాలెం	4443	1,48,53,463
మొత్తం	28,388	7,72,12,215

2022 ఖరీఫ్‌లో వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు లబ్ధిదారులు సంఖ్య నియోజక వర్గాల వారీ ఇలా ఉన్నాయి

నియోజక వర్గం	లబ్ధిదారుల సంఖ్య	సున్నా వడ్డీ మొత్తం
దర్శి	1746	48,56,797
గిద్దలూరు	2724	78,16,380
కనిగిరి	684	16,27,600
మార్కాపురం	1097	33,76,011
ఒంగోలు	42	1,10,902
ఎస్ఎన్‌పాడు	624	18,12,954
వైపాలెం	3257	1,11,07,851
కొండపి	70	22,80,831
మొత్తం	10875	3,29,89,326



వరుసగా ఐదో సంవత్సరం విడుదల

వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు వరుసగా ఐదో సంవత్సరం విడుదలవుతున్నాయి. వైఎస్సార్ సున్నా పంట రుణాలు సైతం బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేయనున్నారు. జిల్లా కేంద్రంతో పాటు, రైతు భరోసా కేంద్రాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేశాం.

– ఎస్ శ్రీనివాసరావు, జేడీఏ, వ్యవసాయశాఖ, ఒంగోలు.

జగనన్న పాలనలో రైతు సుభిక్షం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని రైతులంతా సుభిక్షంగా ఉన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఐదేళ్లు వరుసగావైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ నిధులు ఇవ్వటం హర్షణీయం. అదేవిధంగా సున్నా వడ్డీ కూడా ఇస్తూ రైతులకు భరోసా కల్పిస్తున్నారు.

– మారెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ఎస్పీ ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

మార్కాపురం టౌన్: ఎస్పీ పరమేశ్వరరెడ్డి తొలిసారిగా మార్కాపురం వచ్చిన సందర్భంగా మంగళవారం రాత్రి శ్రీదేవీ భూదేవీ సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి వారిని సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు పెనుగొండ కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్జునరావు తదితరులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట పోలీసు అధికారులు ఉన్నారు.

సెలవుపై వెళ్లిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: వ్యక్తిగత పనులపై కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సెలవుపై వెళ్లారు. బుధవారం నుంచి ఈనెల 29 వరకు సెలవులో ఉంటారని సమాచారం. జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ జిల్లా బాధ్యతలు చూడనున్నారు.

ప్రజలకు చేరువగా తపాలా సేవలు



మాట్లాడుతున్న శివనాగరాజు

మార్కాపురం: తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని విజయవాడ సర్కిల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ జీ శివనాగరాజు సూచించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం తపాలా ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పోస్టల్ ఉద్యోగి పోస్టల్‌శాఖలో అమలవుతున్న సేవింగ్ స్కీములను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు మరింత చేరువచేయాలని, ఉద్యోగులు బాధ్యతగా మెలిగి తపాలా గౌరవాన్ని పెంచాలన్నారు. సమావేశంలో మార్కాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కే శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని మార్కాపురాన్ని ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, శ్రీనివాసరావు, మహమ్మద్ ఆలీ, వెంకటేశ్వర్లు, ఉద్యోగ సంఘం నాయకులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

- దరఖాస్తుకు చివరి తేదీ ఫిబ్రవరి 28
- ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీ
- 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు నోటిఫికేషన్
- జిల్లాలో 11 కళాశాలలు

బేస్తవారిపేట: ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోంది. నేడు ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కళాశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. కార్పొరేట్ స్థాయిలో స్టడీ అవర్స్‌తో కూడిన ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. జగనన్న విద్యాకానుకగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూస్, యూనిఫాం, బెల్ట్, అమ్మ ఒడి పథకం వర్తింపు, సుందరమైన తరగతి గదులు, ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. చక్కని ల్యాబొరేటరీలలో కంప్యూటర్ విద్య, అన్ని వసతులతో వసతి గృహం, పౌష్టికాహారం, నిపుణులతో యోగా, వ్యాయామ విద్య, క్రీడలు, ఆరోగ్య పర్యవేక్షణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో అందిస్తున్నారు.

5వ తరగతిలో చేరేందుకు అర్హత:

2023–24 ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి చదివి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1–09–2011 నుంచి 31–08–2015 మధ్య జన్మించి ఉండాలి. బీసీ, ఓసీ అభ్యర్థులు 1–09–2013 నుంచి 31–08–2015 తేదీల మధ్య జన్మించి ఉండాలి.



సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులు

ఇంటర్మీడియెట్‌కు అర్హతలు:

2023–24లో పదో తరగతి చదివి మొదటిసారి ఉత్తీర్ణత సాధించాలి. అభ్యర్థులు తమ జిల్లాలోని కళాశాల/పాఠశాలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్షకు మించకూడదు.

ప్రవేశ పరీక్ష తేదీ:

5వ తరగతి ప్రవేశ పరీక్ష 10–03–2024 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు.
ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్ష 10–03–2024న మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు.

ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తు చేయాల్సిన వెబ్‌సైట్: https://apbragcet.apcfss.in

ఇంటర్మీడియెట్, 5వ తరగతికి దరఖాస్తు చేసుకోవాలి



జిల్లాలోని 11 గురుకుల పాఠశాలలు, 10 కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. 800 మంది ఇంటర్మీడియెట్, 880 మంది విద్యార్థులు 5 వ తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అన్నీ వసతులతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. ఆధునిక సాంకేతిక అంశాల్లో శిక్షణ, ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందిస్తారు.

– డీ జయ, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ డీసీఓ

జిల్లాలో 11 గురుకుల పాఠశాలలు, కళాశాలలు:

జిల్లాలో 10 గురుకుల కళాశాలలు, 11 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. బాలికలకు సంబంధించి సింగరాయకొండ, దూపాడు ఆర్ట్స్, కొండపి, చీమకుర్తి, మార్కాపురం, కంభం, రాచర్ల సైన్స్ కళాశాలలు ఉన్నాయి. అబ్బాయిలకు సంబంధించి దర్శి, వెలుగొండ సైన్స్, అర్ధవీడు ఆర్ట్స్ కళాశాలలు ఉన్నాయి.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

- జిల్లాలో 17 చెక్‌పోస్టుల ఏర్పాటు
- రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

మార్కాపురం: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. మార్కాపురం డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సీఐలు, ఎస్సైలతో సమీక్ష నిర్వహించిన అనంతరం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. అంతర్ జిల్లా సరిహద్దు ప్రాంతాలైన నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, గుంటూరు, బాపట్ల, పల్నాడు తదితర అంతర్ జిల్లాల వద్ద ఇప్పటికే 17 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలీస్ అధికారి రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పర్యటించి ప్రజలతో సమావేశాలు ఏర్పాటుచేసి గ్రామ రాజకీయాల గురించి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని తెలిపామన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని ఆదేశించినట్లు చెప్పారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఆ గ్రామాల గురించి, ప్రధానమైన పార్టీల నేతల సమాచారాన్ని సేకరించాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల ఆకస్మిక తనిఖీని తరచుగా చేపడతామన్నారు. హైవేలలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతోపాటు ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించి అక్కడ డివైడర్స్ ఏర్పాటు చేయాలని, దీనితోపాటు యాక్సిడెంట్లపై వాహనదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీసు విజువల్‌ను పెంచాలన్నారు. సమావేశంలో డీఎస్పీ బాలసుందరరావు, ట్రైనీ డీఎస్పీ షెహవాజ్, సీఐలు ఆవుల వెంకటేశ్వర్లు, రామకోటయ్య, దాసరి ప్రసాద్, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.



ఎస్పీ పరమేశ్వరరెడ్డి

జాతీయ స్థాయి కరాటే విజేతలకు అభినందన



జాతీయ స్థాయి కరాటే విజేతలను అభినందిస్తున్న రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక

ఒంగోలు: జాతీయ స్థాయి కరాటే పోటీల విజేతలను రాగ ఉమన్ ఎంపవర్‌మెంట్ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక అభినందించారు. స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 18న తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి కరాటే కుంగ్‌ఫూ చాంపియన్ షిప్‌లో జిల్లా తథాగత్ బోధి ధర్మ షిటోరియా కరాటే ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు 7 బంగారు, ఐదు వెండి పతకాలు సాధించడం అభినందనీయం అన్నారు. కటాస్ విభాగంలో ఈ పతకాలు సాధించిన తీరును విద్యార్థులతో మాట్లాడి తెలుసుకుని వారిని అభినందించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో శారీరక దృఢత్వం అత్యవసరం అని, అందుకు కరాటే ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ విద్యలను తమ స్వప్రయోజనాలకు కాకుండా కేవలం ఆత్మ రక్షణకు ఉపయోగించాలన్నారు. రైజ్ కాలేజీలోని విద్యార్థినులకు కొద్ది సంవత్సరాలుగా కరాటే శిక్షణ ఇప్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం శిక్షకులు మాస్టర్ డి.వెంకటేష్‌ను రైజ్ కాలేజీ యాజమాన్యం తరఫున అభినందించారు.

వాస్తవాలను విశ్వసించండి

- అభివృద్ధి ప్రదాతకు పట్టం కట్టండి
- ప్రతి ఒక్కరూ బాగుండాలని కోరుకోవడమే మాకు తెలిసింది
- బాలినేని సతీమణి శచీదేవి



ఇంటింటి ప్రచారంలో భాగంగా మహిళలతో మమేకం అవుతున్న బాలినేని శచీదేవి

ఒంగోలు: వాస్తవాలను విశ్వసిస్తూ అభివృద్ధి ప్రదాతకు పట్టం కట్టాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక 36వ డివిజన్‌లో మహిళలతో మంగళవారం రాత్రి ''మమేకం..స్త్రీ శక్తితో శచీదేవి'' కార్యక్రమంలో భాగంగా విన్నకోట వారి వీధిలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుంటూ వారి విజ్ఞప్తులను స్వీకరించారు. వాస్తవం గడపదాటేలోపు అవాస్తవం ఊరు చుట్టి వస్తుందంటారని, అటువంటి అవాస్తవాలను నమ్మవద్దన్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో 2 సంవత్సరాలు కరోనాతోనే పోయిందని, అయినా నగరంలో పరిస్థితులు మెరుగు పరిచే క్రమంలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వేగంగా చేపడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయేదని, కానీ నేడు ఇంటింటికీ చెత్త వాహనాలు వస్తూ రోడ్డుమీద చెత్త కనిపించకుండా చర్యలు చేపడుతున్నారన్నారు. ఇక సంక్షేమం విషయంలో ప్రతి పేదవాడు ఎదగాలని కోరుకుంటున్నారని , అందులో భాగంగా మీకు లేదా మీ బంధువులకు లబ్ధి చేకూరి ఉండవచ్చన్నారు. నగరంలో 21 వేల మందికి ఇంటిపట్టాలు ఇస్తే అవన్నీ వైఎస్సార్‌సీపీకి చెందిన వారికి ఇచ్చారంటూ తప్పుడు ప్రచారం చేయడాన్ని ప్రజలు కూడా గమనించాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి పథకంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, అవాస్తవాలు ప్రచారం చేసేవారికి సరైన గుణపాఠం చెప్పేందుకు ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఎంఎల్‌ఏ, ఎంపీ అభ్యర్థులకు ఓటు వేసి అఖండ మెజార్టీతో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఢాకా సుజాత హనుమారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పిడపర్తి మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విన్నకోట శ్రీనివాసరావు, ఉప్పుగుండూరి శ్రీనివాసరావు, చుండూరి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, పెద్దిరెడ్డి నియంతకుమారి, వేమూరి భవాని, నీలంరాజు సరోజ, ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, జిల్లా కార్యదర్శి బత్తుల మరియమ్మ, రావులపల్లి ధనలక్ష్మి యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి అరుణ, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జిల్లెళ్లమూడి రమాదేవి, హనుమంతునిపాడు ఎంపీపీ సావిత్రి, దాసరి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపిక చేసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టు

సింగరాయకొండ (మర్రిపూడి): సింగరాయకొండ మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి ప్రకాశం కబడ్డీ జట్టును ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారుల్లో ప్రతిభ గల వారిని ఎంపిక చేశామని, ఎంపికైన క్రీడాకారులు మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు పీ హజరత్తయ్య వివరించారు. ఉప సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, ఎంపీటీసీలు ఏపూరి శ్రీనివాసులు, కే అంకయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాధవరావు, కేశవరపు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కంభం: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని జంగంగుంట్ల సమీపంలో హైవే రోడ్డుపై చోటు చేసుకుంది. వివరాలు.. మార్కాపురం లో నివాసం ఉంటున్న కొట్టే రాఘవేంద్ర(45) తన స్వగ్రామమైన మండలంలోని సైదాపురంలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి రాత్రి 11 గంటల తర్వాత తిరుగు ప్రయాణంలో ఉన్నాడు. ఈ సమయంలో జంగంగుంట్ల వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రాఘవేంద్ర తల మొత్తం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. కంభం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పులి రాజేష్ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి



తర్లుపాడు: మండలంలోని మేకలవారిపల్లి టోల్ ప్లాజా సమీపంలో కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. తర్లుపాడు ఎస్సై వేముల సుధాకర్ తెలిపిన వివరాల మేరకు మేకలవారిపల్లికి చెందిన మేకల నారాయణరెడ్డి (65) గేదెలను మేపుకొని ఇంటికి వస్తున్న క్రమంలో టోల్‌ప్లాజా సమీపంలో ఒంగోలు వైపునకు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. గాయాలపాలైన నారాయణరెడ్డిని చికిత్స నిమిత్తం మార్కాపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నారాయణ రెడ్డి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రెండ్ సెట్టర్స్!

ఇంజినీర్‌లా గీతలు గీసి.. డాక్టర్‌లా ముక్కలు చేసి.. నరాలను దారాలుగా మలిచి, కంటి చూపును సూదిగా తలచి నిన్ను దర్జాగా తీర్చిదిద్దేది దర్జీలే.! ఆదిమానవుడు ఆధునికంగా మారిన క్రమంలో దర్జీల పాత్ర ఎంతో కీలకం. ప్రధాన మంత్రి మొదలు సామాన్య ప్రజల వరకు ప్రతి ఒక్కరూ అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలని కోరుకుంటారు. వస్త్రధారణతో ట్రెండ్ సెట్ చేయాలని తహతహలాడేవారికి సమాజంలో కొదవలేదు. వాస్తవానికి ఆ ట్రెండ్ సెట్ చేసే వారి వెనుక ఉన్న అసలైన ట్రెండ్ సెట్టర్లు దర్జీలే..!! నేడు టైలర్ల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..

– ఒంగోలు డెస్క్



టైలర్ వృత్తి రోజురోజుకీ అనేక మార్పులకు గురవుతూ వచ్చింది. ఇప్పుడు ఫ్యాషన్ టెక్నాలజీలో భాగంగా మారింది. పాత కుట్టు మిషన్ల స్థానంలో అత్యంత ఆధునిక మిషన్లు వచ్చి చేరాయి. కంప్యూటర్ల ప్రవేశంతో ఎలాంటి డిజైన్‌నైనా అలవోకగా తీర్చిదిద్దే విజ్ఞానం చేతల్లోకి వచ్చేసింది. అయితే రెడీమెడ్ వస్తువుల రాకతో టైలర్ వృత్తి సంక్షోభంలో పడింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో గ్రామగ్రామాన వెలసిన దర్జీ దేవుళ్లు తినడానికి తిండి లేని పరిస్థితుల్లో రోజువారీ కూలీలుగా మారారు. మరికొందరు వ్యవసాయ పనులు చేసుకుంటూ పొట్టపోసుకున్నారు. అలాంటి దుర్భర పరిస్థితుల్లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జీఓ నెంబర్ 86 విడుదల చేసి ఫెడరేషన్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. కోటి రుపాయల ఫండ్ విడుదల చేశారు. అయితే దురదష్టవశాత్తు ఆయన మరణించడంతో టైలర్స్ ఫెడరేషన్ మూలన పడింది. ఆ తరువాత వచ్చిన పాలకులు ఏ మాత్రం పట్టించుకోలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాటలతో కాలం గడిపారు. ఎన్నికలు 3 నెలలు ఉండగా హడావుడిగా ఫెడరేషన్‌కు ఒక అధ్యక్షుడిని ప్రకటించి చేతులు దులుపుకొన్నారు. ఈ పరిణామం టైలర్లను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది. ఈ తరుణంలో 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చీ రాగానే టైలర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఒంగోలుకు చెందిన సుభాన్ బీని కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు.

నేడు టైలర్ల పండగ

- రాష్ట్ర ప్రభుత్వ సాయంతో దర్జీల్లో పెరిగిన భరోసా
- కమ్యూనిటీ హాల్ కోసం టైలర్ల వినతి
- నేడు టైలర్స్ డే

ఏటా ఫిబ్రవరి 28వ తేదీని ప్రపంచ వ్యాప్తంగా టైలర్స్ డేగా పాటిస్తున్నారు. హిందువులు సంక్రాంతి, ముస్లింలు రంజాన్, క్రిస్టియన్లు క్రిస్మస్ పండగ చేసుకున్నంత సంతోషంగా అన్ని కులాలు, మతాలకు చెందిన టైలర్లు టైలర్స్ డేను నిర్వహించుకుంటున్నారు. సభలు, సమావేశాలు నిర్వహించడం, సీనియర్ టైలర్లను సన్మానించడం, టైలర్ల సమస్యల పరిష్కారంపై చర్చించడం లాంటివి చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో 5 వేల మందికి పైగా టైలర్లు జీవనోపాధి పొందుతున్నారు. వీరిలో షాపులు నిర్వహిస్తున్న వారితోపాటు ఇంటి వద్ద దుస్తులు కుట్టే లేడీస్ టైలర్లు కూడా ఉన్నారు. మొత్తం మీద జిల్లాలో 25 వేల మందికి పైగా టైలర్ వృత్తిలో కొనసాగుతున్నారు.

పెరిగిన మగ్గం వర్కర్లు

ఇటీవల కాలంలో మగ్గం వర్క్‌కు డిమాండ్ బాగా పెరిగింది. ఎంత ఖరీదైనా సరే వెచ్చించేందుకు మహిళలు సిద్ధం కావడంతో లేడీస్ టైలర్లు మగ్గం వర్కర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే మన రాష్ట్రంలో మగ్గం వర్కర్ల కొరత ఉండడంతో కోల్‌కతా నుంచి మగ్గం వర్కర్లను రప్పిస్తున్నారు. ఇప్పుడు ఒక్క ఒంగోలు నగరంలోనే 2 వేల మందికి పైగా వర్కర్లు ఉన్నారంటే వారికి ఉన్న డిమాండ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. వర్కర్లకు రోజుకు 1000 నుంచి 1500 రుపాయల వరకు కూలి చెల్లిస్తుండటం గమనార్హం. ఆపై అదనంగా పనిచేస్తే గంటకు 100 రుపాయల వరకు కూలి ఇస్తున్నారు. మిషన్ ఎంబ్రాయిడరీ టెక్నాలజీ కూడా అందుబాటులోకి రావడంతో కొందరు ఔత్సాహికులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని ఫ్యాషన్ రంగంలో రాణిస్తున్నారు.



'చేదోడు'తో కొత్త ఉత్సాహం

టైలర్ వృత్తిని ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ నవరత్నాల్లో భాగంగా చేదోడు పథకాన్ని ప్రకటించారు. అర్హులైన టైలర్లకు ఏటా రూ.10 వేలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇలా గతంలో ఏ ప్రభుత్వం కూడా టైలర్లను ఆదుకున్న దాఖలాలు లేవు. జగన్‌లా తమ కష్టసుఖాలను పట్టించుకున్న వారు లేరని దర్జీలు చెబుతున్నారు.

చేదోడుతో కుదుటపడ్డాం



టైలర్ల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేదోడు పథకం కింద 10 వేల రుపాయలను ఇవ్వడం మాకు ఎంతో ఉపకరిస్తుంది. ఏటా క్రమం తప్పకుండా 10 వేల రుపాయలు ఇస్తున్నారు. టైలర్ల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలి. మహిళలకు ముఖ్యంగా యువతులకు మగ్గం వర్క్‌లో శిక్షణ ఇవ్వాలి. కంప్యూటర్ టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి షాపులు పెట్టుకునేందుకు సహాయం చేయాలి.

– ఉప్పలపాటి ప్రేమకుమారి, లేడీస్ టైలర్

ప్రభుత్వం సానుకూలంగా ఉంది



ఎప్పటి నుంచో టైలర్ వృత్తిలో ఉన్న వారు తమ పిల్లలకు టైలరింగ్ నేర్పించడం లేదు. ఇతరులు కూడా టైలర్ వృత్తిలో వచ్చేందుకు ఆసక్తి కనపరచడం లేదు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా చేదోడు పథకం కింద ఏటా రూ.10 వేల వరకు ఇవ్వడంతో ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఒక్క ప్రకాశం జిల్లాలోనే వేలాది మందికి చేదోడు డబ్బు అందుతోంది. ఇప్పటికీ చేదోడు రాని వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా మగ్గం వర్క్‌లో ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. ఇప్పటి వరకు ఇన్ని పథకాలు ఎవరూ ఇవ్వలేదు. నవరత్నాలు పథకాలతో అనేక మంది టైలర్లు లబ్ధి పొందారు.

– షేక్ సుభాన్‌బీ, రాష్ట్ర టైలర్స్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్



టైలర్స్ డే ఎలా వచ్చిందంటే..

అసలు టైలర్స్ డే ఎలా వచ్చిందనే విషయం మీద రెండు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. కుట్టు మిషన్ కనుగొన్న ఇలియన్స్ హోవే పుట్టిన రోజైన ఫిబ్రవరి 28ని టైలర్స్ డేగా పాటిస్తున్నట్లు చెబుతారు. ఇదిలా ఉండగా అద్భుత నైపుణ్యం కలిగిన ఒక టైలర్‌ను బ్రిటిష్ అధికారి ఒకరు 28 ముక్కలుగా నరికి చంపారని, ఫిబ్రవరి నెలలో 28 రోజులు ఉంటాయి కాబట్టి ఆ రోజును టైలర్స్ డేగా నిర్వహిస్తున్నారనేది మరికొందరి అభిప్రాయం.

నా కుటుంబం నిలదొక్కుకుంది



మాది మద్దిపాడు గ్రామం. నేను లేడీస్ టైలర్ షాపు నిర్వహిస్తున్నా. మావారు రాజేష్ ఒంగోలులోని ఒక కార్ సర్వీస్ సెంటర్‌లో పనిచేసేవారు. మా కుటుంబం సాదాసీదాగా గడిచిపోయేది. అయితే జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత డ్వాక్రా మహిళలకు ఇస్తున్న ప్రోత్సాహం చూసి నేను కూడా ఏదో ఒకటి చేయాలి అనిపించింది. డీఆర్‌డీఏ పీడీని సంప్రదిస్తే రూ.9 లక్షలు రుణం ఇవ్వడానికి అధికారులు అంగీకరించారు. రూ.6.50 లక్షలతో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మిషన్ కొనుగోలు చేసి కొత్త షాపు పెట్టా. ఇప్పుడు నా దగ్గర మరో ముగ్గురు ఉపాధి పొందుతున్నారు. మావారు కూడా సర్వీస్ సెంటర్‌లో పని మానేసి నాకు అండగా నిలిచారు. ఇప్పుడు మా ఆదాయం కూడా గతంలో కంటే పెరిగింది. మా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది. మా కుటుంబానికి చేయూత, చేదోడు, అమ్మఒడి సంక్షేమ పథకాలు అందాయి. జగనన్న ప్రభుత్వం చాలా బాగుంది. మాలాంటి పేదలకు ఎంతో మేలు జరుగుతోంది.

– గద్దల కవిత

సర్వేయర్ ఆత్మహత్య

- కేజీబీవీ విద్యార్థిని అదృశ్యం కేసులో అనుమానితుడు
- కనిగిరి డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో కొనసాగుతున్న విచారణ
- మంగళవారం రాత్రి ఒంగోలులో బాలిక ఆచూకీ కనుగొన్న పోలీసులు



కేజీబీవీలో ఉపాధ్యాయులను విచారిస్తున్న కనిగిరి డీఎస్పీ రామరాజు



రైలు పట్టాల వద్ద గోపిరెడ్డి మృతదేహం



మృతుడు గోపిరెడ్డి (ఫైల్)

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రమైన సీఎస్ పురం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన బాలిక అదృశ్యం కేసులో అనుమానితుడిగా ఉన్న సర్వేయర్ సోమవారం ఒంగోలులో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సీఎస్ పురం పోలీసులు, రైల్వే పోలీసులు విచారణ చేపట్టగా పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. పోలీసుల కథనం మేరకు.. సీఎస్ పురానికి చెందిన బాలిక స్థానికంగానే ఉన్న కేజీబీవీలో పదో తరగతి చదువుతోంది. బాలికకు జ్వరంగా ఉండటంతో ఈనెల 22వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో పీఈటీ రఫియా ఇంటి దగ్గర వదిలిపెట్టి వెళ్లారు. ప్రీ పబ్లిక్ పరీక్షలు జరుగుతుండటంతో బాలికకు చికిత్స చేయించిన తల్లి 23వ తేదీనే పాఠశాలలో వదిలి వెళ్లింది. అయితే ఆ బాలిక చేతికి ఉన్న సెలైన్ క్యాన్యులా తొలగించేందుకు 24వ తేదీన స్థానిక వైద్యుని వద్దకు పీఈటీ తీసుకెళ్లారు. డాక్టర్ సూచన మేరకు ఏదైనా తిని వస్తానని అక్కడికి సమీపంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి బయలుదేరిన బాలిక అదృశ్యమైంది. విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు చుట్టుపక్కల వెదకగా ఆచూకీ లభించకపోవడంతో విద్యార్థిని తల్లి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

బాలిక అదృశ్యంపై డీఎస్పీ విచారణ

బాలిక అదృశ్యం కేసుపై కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు ఆధ్వర్యంలో మంగళవారం విచారణ చేపట్టారు. డీఎస్పీతో పాటు పామూరు సీఐ రామానాయక్ స్థానిక కేజీబీవీని సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థిని ఇంటితోపాటు అమ్మమ్మ ఇంటినీ పరిశీలించి విచారణ చేపట్టారు.

సర్వేయర్‌పై అనుమానం

చీమకుర్తి మండలం దేవరపాలెం గ్రామానికి చెందిన కుమ్మిత గోపిరెడ్డి సీఎస్‌పురం మండలం కొత్తపల్లి సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. సీఎస్ పురంలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆ ఇంటి పక్కనే ఉన్న నివాసానికి తరచూ వస్తున్న బాలికతో గోపిరెడ్డికి పరిచయం ఏర్పడింది. బాలిక వెళ్లిపోయినప్పటి నుంచి సర్వేయర్ కూడా కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు, కేజీబీవీ ఉపాధ్యాయులు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సర్వేయర్‌ను అదుపులోకి తీసుకుని ప్రాథమికంగా విచారించి వదిలిపెట్టినట్లు తెలిసింది. స్నేహితులతో కలిసి 26వ తేదీ సాయంత్రం కారులో ఒంగోలు వచ్చిన సర్వేయర్.. 27వ తేదీ తెల్లవారుజామున ఒంగోలులో రైలు పట్టాలపై శవమయ్యాడు. ఇదిలా ఉండగా బాలిక ఆచూకీ కోసం డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో పోలీసులు బృందాలు ముమ్మరంగా గాలించాయి. ఒంగోలులో 60 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న నాని అనే వ్యక్తి వద్ద ఉన్న బాలికను మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

బైకు అదుపు తప్పి యువకుడు మృతి



మృతి చెందిన వంశీకృష్ణ

చీమకుర్తి: బైక్ అదుపు తప్పి యువకుడు మృత్యువాత పడిన సంఘటన సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత సంతనూతలపాడు సమీపంలో కర్నూలు రోడ్డుపై చోటుచేసుకుంది. వివరాలు.. చీమకుర్తి మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన మలసాని వంశీకృష్ణ(30) ఒంగోలు నుంచి చీమకుర్తికి బైకుపై వస్తున్నాడు. ఈ క్రమంలో సంతనూతలపాడు సమయంలో బైకు అదుపుతప్పి కింద పడటంతో ముఖం, తలపై తీవ్రంగా గాయాలయ్యాయి. అదే మార్గంలో వెళ్తున్న వాహనదారులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో ఒంగోలు జీజీహెచ్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్యంలో వంశీకృష్ణ మరణించినట్లు ఎస్సై దేవకుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బాలికల కిడ్నాప్‌నకు యత్నం

- కురిచేడు మండలం బోదనంపాడులో కలకలం



కిడ్నాపర్లు వాడిన కారు

కురిచేడు: పాఠశాల నుంచి ఇంటి వెళ్తున్న బాలికలను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశారు. ఈ సంఘటన కురిచేడు మండలంలోని బోదనంపాడులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి, 9వ తరగతి విద్యార్థినులు సోమవారం సాయంత్రం స్వగ్రామమైన అలవలపాడుకు నడచి వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఉన్న చింత చెట్టు వద్ద మొబైల్ ఫోన్ వారి కంట పడింది. ఆ ఫోన్ రింగ్ అవుతుండటంతో బాలికలు మాట్లాడారు. ఫోన్ పోయిందంటూ అవతలి వైపు నుంచి ఓ మహిళ మాట్లాడుతూ.. తమది కురిచేడు, తెలంగాణ అని రెండు రకాలుగా చెప్పడంతో బాలికలు ఆ ఫోన్ అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చే సమయంలో ఆ ఫోన్ అక్కడ లేదు. మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్తున్న బాలికలను ఫోన్ లభ్యమైన చింతచెట్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఏపీ16డిపి4779 నంబర్ గల కారులోకి లాగేందుకు ప్రయత్నించారు. బాలికలు అప్రమత్తమై బ్యాగులు, చెప్పులు వదిలి బోదనంపాడు వైపు పరుగుతీశారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని చూసి దుండగులు కారుతో సహా ఉడాయించారు. జరిగిన విషయాన్ని బాలికలు తమ పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేశారు. కిడ్నాపర్లు వాడిన కారును సీసీ పుటేజీలో బాలికలు గుర్తించారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

త్రిపురాంతకం: మహాశివరాత్రి మహోత్సవాలను బాలా త్రిపురసుందరీదేవి, పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయాల్లో వైభవంగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ.. అధికారులంతా సహకరిస్తేనే మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించగలమన్నారు. రోడ్డు మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి కోరారు. సమావేశంలో సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, తహసీల్దార్ రామకృష్ణ శివ ప్రసాద్, ఎస్సై సాంబశివయ్య, మార్కాపురం డిపో మేనేజర్ నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్‌బాబు, వైద్యాధికారి నాగేశ్వరరావు నాయక్, విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ నీలిమ, ఈఓ చెన్నకేశవరెడ్డి, ఫారెస్ట్ అధికారి మోహన్, ఆర్ఐ ముకుంద హరి, అర్చకులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.